ఐపీఎల్ ఫ్రాంచైజీలకు
బీసీసీఐ కఠిన నిబంధనలు



07

మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శ్రేయోభిలాషులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

14.3.2026 శనివారం Saturday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 324 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar




# బాధ్యతాయుతంగా మూసీ అభివృద్ధి

- 20 టీఎంసిల గోదావరి జలాలు తరలిస్తాం
- అద్భుత నగరాన్ని కాపాడుకునే బాధ్యత మనది
- ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం
- వరదలు వస్తే ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు
- నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు
- ప్రాజెక్టును విమర్శిస్తున్న వారు అక్కడ ఉండగలరా?
- మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



**జనతా న్యూస్, హైదరాబాద్ :** మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశారని, ఇప్పటికీ బృహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన

మిగతా 2 లో

## కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం




**అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోడీ**

వివరాలు 4 లో

అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరాఝార్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేటి నుంచి పదో తరగతి పరీక్షలు



- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం
- సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు

03



## గ్యాస్ సరఫరాపై భయాందోళనకు గురి కావొద్దు

**బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు**

- అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు
- జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి
- గ్యాస్ కొరత పై జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి
- సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దు
- గృహ, ఆసుపత్రులకు, విద్యాసంస్థలతో పాటు ఆశ్రమాలకు ప్రాధాన్యత
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ
- కలెక్టర్లు,ఎస్.పి లు, పోలీస్ కమిషనర్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్

అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## మూసీ పేరిట రేవంత్ లూటిఫికేషన్‌కు బీఆర్ఎస్ వ్యతిరేకం

**మూసీ ప్రక్షాళనకు ముందే పేదలను ఖాళీ చేయిస్తారా**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీష్ రావు ప్రశ్నలు**



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు మూసి బ్యూటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 8 సూటి ప్రశ్నలు సంధించారు. వీటికి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి మూసి బ్యూటిఫికేషన్‌పై ప్రెజంటేషన్ ఇస్తున్న సందర్భంగా మొదట తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, మూసీ పేరిట రేవంతు చేస్తున్న లూటిఫికేషన్ కు మాత్రమే వ్యతిరేకమని ,సుందరీకరణ పేరిట వేలాది మందిని నిరాశ్రయులుగా చేస్తుండటానికి వ్యతిరేకమని స్పష్టం చేశారు.

**రేవంత్‌రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది**

సీఎం బినామీలపై దర్యాప్తు జరపండి

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కేటీఆర్ బహిరంగ లేఖ





## మూసీ ప్రక్షాళనను ఎప్పుడూ వ్యతిరేకించలే

- ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం
- మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం
- మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి
- పదేపదే బిజెపిని విమర్శించడం అపండి
- తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు

మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

03

# నేటినుంచి పదో తరగతి పరీక్షలు

## భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

## హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం

## సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు

**హైదరాబాద్,మార్చి13:** తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిముషాల ఆలస్యాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఉంటాయి. పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఇతర ఆలోచనలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీ వైపు మనస్సు మరలకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థి ఏర్పాటు చేసుకున్న టైం టేబుల్ ప్రకారం చదువు కోవాల్సి ఉంటుంది. సందేహాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. అందుకోసం తరగతి ఉపాధ్యాయులు లేదా, మంచి స్నేహితులు, సీనియర్ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలి. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇంట్లో చక్కటి వాతావరణం కల్పించాలి. విద్యార్థిలో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు ప్రతిక్షణం కృషి చేయాలి. అవసరమైన ధైర్యం అందివ్వాలి. పిల్లలు ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తారు కనుక వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానుకూలంగా విద్యార్థికి తగిన పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సమయానికి తగినంత నిద్రపోయేలా కూడా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం. ఇప్పటికే రెండు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించాం. గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులలో మంచి మార్కులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మార్చి 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలను నిర్వహిస్తున్నాం అని అధికారులు వివరించారు.

# మావోయిస్ట్ అగ్రనేత సంస్మరణ సభ

## హాజరైన 230 మందికి ఎన్ఐఎ నోటీసులు

**కరీంనగర్,మార్చి13:** ఇటీవల మావోయిస్టు అగ్రనేత రామచంద్రారెడ్డి (వికల్ప్) అంత్యక్రియలు, సంస్మరణ సభకు హాజరైన మాజీ మావోయిస్టులపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 230 మందికి నోటీసులు జారీ చేయడం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పెద్ద చర్చకు దారితీసింది. గతేడాది అక్టోబరు 18 న హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడలో మావోయిస్టు అగ్రనేతలు రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిల జ్ఞాపకార్థం 'నారాయణపూర్ అమరుల సంస్మరణ సభ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున మాజీ మావోయిస్టులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. సభలో పాల్గొన్న వారిపై ఎన్ఐఎ ఆకస్మికంగా నోటీసులు జారీ చేసింది. ఈ సభలో పాల్గొన్న కొందరు నాయకులు ప్రభుత్వ వ్యతిరేక, వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గాదె ఇన్నయ్యలాంటి వారిపై ఇప్పటికే దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. నిషేధిత సంస్థలతో సంబంధాలు లేదా ఆ సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారా అనే కోణంలో లోతైన విచారణ చేపట్టడానికి ఈ నోటీసులు ఇచ్చారు. జస్టిస్ చంద్రకుమార్, సోనీ సోరి, పినాకపాణి వంటి ప్రముఖులు ఈ సభలో పాల్గొనడం కూడా దర్యాప్తు సంస్థల దృష్టిని ఆకర్షించింది. నోటీసులు అందుకున్నవారిలో మెజారిటీ వ్యక్తులు హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, ముల్కనూరు, కమలాపూర్, ధర్మసాగర్, పరకాల, టేకుమట్ల, వేలేరు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. దశాబ్దాల క్రితమే జనజీవన స్రవంతిలో కలిసిపోయిన తమకు, ఇప్పుడు పాత సంబంధాల పేరుతో నోటీసులు రావడంపై మాజీ మావోయిస్టులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చందానగర్ ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

## కాలి బూడిదైన ఫర్నీచర్ సామాన్లు

**హైదరాబాద్,మార్చి13:** నగరంలోని చందానగర్ ప్రాంతంలో ఉన్న ఒక ఫర్నిచర్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి తర్వాత భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని ఐదు అంతస్తుల్లో నిల్వ చేసిన ఫర్నిచర్ మొత్తం తగలబడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది. 7 ఫైర్ ఇంజన్లు, 11 వాటర్ ట్యాంకర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణం ఐదు అంతస్తుల భవనంలో ఉండటం, లోపల సోఫాలు, బెడ్‌లు, టేబుల్స్ తదితరాలు ఉండడం వల్ల మంటలు వేగంగా వ్యాపించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి కారణం ఏంటనేది తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ లేదా ఇతర కారణాలు ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు సంయుక్తంగా ఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా చందానగర్ ప్రాంతంలో కొంత వరకూ సేవలకు అంతరాయం కలిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జేఈఈ దరఖాస్తుదారులకు ఛాన్స్

**హైదరాబాద్,మార్చి13:** జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలనే వారికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుభవార్త చెప్పింది. దరఖాస్తు చేసుకొనేందుకు మరో చాన్స్ ఇచ్చినట్టు పేర్కొన్నది. విద్యార్థుల నుంచి పెద్దఎత్తున వినతులు వచ్చిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ విండోను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించింది. గురువారం నుంచి శుక్రవారం రాత్రి 9 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే సమర్పించిన దరఖాస్తుల్లో మార్పు చేసుకొనే అవకాశం లేదని స్పష్టం చేసింది. జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి 9 వరకు జరుగనున్నాయి.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్,మార్చి13:** దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. గురువారంతో పోలిస్తే నేశుక్రవారం నాటి మార్కెట్లలో గోల్డ్, సిల్వర్ రేట్లు ఇంకాస్త దిగొచ్చాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం.. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో బంగారం, వెండి రేట్లను పరిశీలిస్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధరపై రూ.980 పతనమై రూ.1,61,240కు చేరగా.. 22 క్యారెట్ల 10 గ్రాములపై రూ.900 తగ్గి రూ.1,47,800 వద్ద ట్రేడవుతోంది.ఇక వెండి విషయానికొస్తే.. క్రితం రోజుతో పోలిస్తే కిలో వెండిపై రూ.100 తగ్గింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,79,900గా ఉంది. అయితే.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమే ధరల తగ్గుదలకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బాధ్యతాయుతంగా మూసీ అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

మాట్లాడారు. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించామని చెప్పారు. నిజాంలు, బ్రిటీషర్లు సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏమైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం అని బిఆర్‌ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. మూసీ, ఈసీ సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నాం. మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేయత్నం చేస్తున్నాం. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులను పునరుద్ధరిస్తున్నాం. అందుకు ప్రజలు మాకు ఘన స్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు.. మూసీ పక్కన నివసిస్తారా? అలాంటి వాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్లే వరదలొస్తున్నాయి. మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్గొండ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. భవిష్యత్ తరాలకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వారి బాధల్ని కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్టుపై ముందుకు వెళ్తున్నాం. దీనికి అందరి సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రజలకు




నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు. గొప్ప నగరం హైదరాబాద్‌ను నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తమకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదని కుండబద్దలు కొట్టారు. మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల అధినేతలు, అగ్రనేతలకు సీఎం రేవంత్ సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా? అని ఆయా పార్టీల నేతలకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా చురకలంటించారు. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టుల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. పాలసీలు, వర్కింగ్ స్టైల్ మార్చుకున్నామని చెప్పారు. కొద్దిమంది ముఖ్యమంత్రులే ప్రజలకు గుర్తున్నారని పేర్కొన్నారు. వారు వేసిన పునాదులే అలా గుర్తుంచుకునేలా చేశాయని చెప్పారు. ఎంతసేపు రంగారెడ్డి జిల్లా గురించే ఆలోచిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లా గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు. మేం తెచ్చే ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. బుల్‌డోజర్లతో కూల్చేస్తున్నారని అంటున్నారని చెప్పారు. అవి చదువుకున్నవాళ్లు మాట్లాడే మాటలా అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును అడ్డుకునే వాళ్లు మూడు నెలలు అక్కడ నివసిస్తారా? అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కన్యాకుమారి లాగా బాపూఘాట్ కూడా రెండు నదుల సంగమం అని ఎంతమందికి తెలుసునని ప్రశ్నించారు. గోదావరి జలాల్లో 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టినట్లు తెలిపారు. గాంధీ విగ్రహానికి సుమారుగా రూ.75 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు అంబేద్కర్ విగ్రహానికి కోట్లు ఖర్చు చేస్తే తాము వ్యతిరేకించలేదని సీఎం రేవంత్ చెప్పారు.

# మాజీ డిజిపి హెచ్‌జె దొర మృతి

## అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి

## వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో కీలక పదవుల నిర్వహణ



**హైదరాబాద్,మార్చి13:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్. జె. దొర మరణించారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకున్నారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారు. ఇంట్లో బాత్‌రూమ్‌లో ఆయన పడిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలుస్తోంది. 1965 ఐపీఎస్ బ్యాచ్ అధికారి హెచ్.జె.దొర.1996 నుంచి 2002 వరకు ఉమ్మడి ఏపీ డీజీపీగా దొర విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఉమ్మడి ఏపీలో నక్సలైట్లను అణిచి వేయడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే సీఐఎస్ఎఫ్ డీజీగా, విజిలెన్స్ కమిషనర్‌గా సైతం దొర పని చేశారు. 943లో శ్రీకాకుళంలో హెచ్.జె.దొర జన్మించారు. తన సుదీర్ఘ జీవితకాలంలో దాదాపు 40 ఏళ్ల పాటు పోలీస్ విభాగంలో వివిధ హోదాల్లో ఆయన సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదట అడిషనల్ డీజీపీగా అనంతరం డీజీపీగా దొర బాధ్యతలు చేపట్టారు. 2002లో డిప్యూటేషన్‌పై దేశ రాజధాని న్యూఢిల్లీలో సీఐఎస్ఎఫ్ డీజీగా పని చేశారు. పోలీసు శాఖతోపాటు క్రీడారంగంలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఇండియన్ ఒలంపిక్స్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 1993లో పీపుల్స్ వార్ గ్రూపు లక్ష్యంగా చేసుకున్న 40 మంది పోలీసు అధికారుల జాబితాలో హెచ్.జె.దొర పేరు కూడా ఉంది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన పోలీస్ మెడల్ అందుకున్నారు.

# భారీ జీఎస్టీ కుంభకోణం బట్టబయలు

## రూ.84.15 కోట్ల మోసం జరిగినట్లు గుర్తింపు

**హైదరాబాద్,మార్చి13:** తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ భారీ జీఎస్టీ కుంభకోణాన్ని బయటపెట్టింది. సుమారు రూ.84.15 కోట్ల విలువైన ఐటీసీ మోసం జరిగినట్లు గుర్తించింది. ప్రధాన నిందితుడు, ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్‌ను అధికారులు అరెస్టు చేశారు. నిందితుడు నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు గుర్తించారు. సందీప్‌కు సంబంధమున్న ఇతర సంస్థల్లోనూ అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈక్రమంలో వాటి రిజిస్ట్రేషన్లను అధికారులు రద్దు చేశారు. సందీప్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

# జ్యువెలరీ షాపులో దొంగతనం

## తాళాలు పగులగొట్టి ఆభరణాల చోరీ

**జగిత్యాల,మార్చి13 :** జగిత్యాల జిల్లాలో దొంగలు రెచ్చిపోయారు. మెట్‌పల్లిలో తాళాలు పగులగొట్టి ఓ ఆభరణాల షాపులో చోరీకి పాల్పడ్డారు. లాకర్ తెరిచేందుకు విఫలయత్నం చేశారు. 30 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. ఉదయం షాపు తాళాలు పగులగొట్టి ఉండటంతో గమనించిన షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇటీవల కాలంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు గస్తీని పెంచి రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## టూరిస్ట్ బోల్తాపడి నలుగురు ప్రయాణికుల మృతి

## క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు

## సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు

**నిజామాబాద్,మార్చి13 :** నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందల్వాయి మండలంలోని గన్నారం శివారులో ఉన్న బ్రహ్మంగారి ఆలయం సమీపంలో 44వ జాతీయ రహదారిపై టూరిస్ట్ బస్సు అర్ధరాత్రి 2 గంటల సమయంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందగా.. పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టూరిస్ట్ బస్సు వేగంగా ప్రయాణిస్తుండగా.. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో బస్సు ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదం గన్నారం గ్రామ శివారులోని బ్రహ్మంగారి ఆలయం దగ్గర



చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ బస్సు హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, అత్యవసర సేవలకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. బస్సు బోల్తా పడిన సమయంలో తీవ్ర గాయాల కారణంగా వారు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడగా వారిని స్థానికుల సహాయంతో సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఇతర పెద్ద ఆస్పత్రులకు తరలించినట్లు సమాచారం. వైద్యులు గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు రెస్క్యూ బృందాలు శ్రమించాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం అయింది. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

# గ్యాస్ సరఫరాపై భయాందోళనకు గురి కావొద్దు

**బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు**

**అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు**

**జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి**

**గ్యాస్ కొరత పై జరుగుతున్న ప్రచారాన్ని సమర్ధవంతంగా తిప్పి కొట్టాలి**

**సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దు**

**గృహ ,ఆసుపత్రులకు,విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ ,ఆశ్రమాలకు ప్రాధాన్యత**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ**

**కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్**



**హైదరాబాద్,మార్చి13 :** అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్టా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగ దారులతో పాటు ఆసుపత్రిలకు, విద్యాసంస్థలకు, వృద్దాశ్రమలకు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్టిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉ ండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉ పక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు. తాజాగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్టిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉ పక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు,సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి ,గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని,గృహ వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా

**ఇక్కట్లు లేకుండా... బ్లాక్ మార్కెట్ జరక్కుండా చర్యలు**

**పెట్రో డీలర్లతో సిఎస్ రామకృష్ణారావు సమీక్ష**

**హైదరాబాద్,మార్చి13 :** రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్యాస్ కంపెనీలను సిఎం రామకృష్ణారావు ఆదేశించారు. రోజువారి సమీక్ష, బ్లాక్ మార్కెటింగ్ లేకుండా చర్యలు, డిస్టిబ్యూటరీలు, ఎజెన్సీల దగ్గర పోలీస్ నిఘా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇంధన నిల్వలు, గ్యాస్ వినియోగదారులకు పంపిణీ, ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, సివిల్ సప్లై విభాగం అధికారులతో సమీక్ష చేశారు. మావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరా, నిల్వలు, రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 1.29 కోట్ల గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుత డిమాండ్ కు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లు కు డిమాండ్ మేరకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా విషయం లో ఎలాంటి ఆందోళన చేందాల్సిన అవసరం లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 810 డిస్టిబ్యూటరీ కేంద్రాలు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నాయని అన్నారు.

# మూసీ ప్రక్షాళలను ఎప్పడూ వ్యతిరేకించలే

**ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం**

**మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం**

**మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి**

**పదేపదే బిజెపిని విమర్శించడం అపండి**

**తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు**




**హైదరాబాద్,మార్చి13 :** మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.. ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని.. కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా భారత ప్రజలు వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన వారని చెప్పారు. అలాంటి సమయంలో నాయకులు.. ప్రజల్లో ధైర్యం నింపాల్సిందే తప్ప, భయాందోళనలు కలిగించడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు. దేశంలో గృహ వినియోగ ఎల్పీజీ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాంచందర్ రావు తెలిపారు.

# మూసీ పేరిట రేవంత్ లూటిఫికేషన్‌కు బీఆర్ఎస్ వ్యతిరేకం

**మూసీ ప్రక్షాళనకు ముందే పేదలను ఖాళీ చేయిస్తారా**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీష్ రావు ప్రశ్నలు**



**హైదరాబాద్,మార్చి13 :** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు మూసి బ్యూటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 8 సూటి ప్రశ్నలు సంధించారు. వీటికి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి మూసి బ్యూటిఫికేషన్‌పై ప్రెజంటేషన్ ఇస్తున్న సందర్భంగా మొదట తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, మూసీ పేరిట రేవంతు చేస్తున్న లూటిఫికేషన్ కు మాత్రమే వ్యతిరేకమని ,సుందరీకరణ పేరిట వేలాది మందిని నిరాశ్రయులుగా చేస్తుండటానికి వ్యతిరేకమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో మొదట మూసీ బ్యూటీఫికేషన్ కు శ్రీకారం చుట్టామని, రూ. 4వేల కోట్లతో 32 ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, గోదావరి నీళ్లను తెచ్చి మూసీలో పోసీ శుద్ధి చేయాలనీ ప్రణాళికలు వేశామని వెల్లడించారు. ఇవాళ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు చూస్తే తుగ్లన్ పాలన గుర్తుకు వస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి పథంలో నడిపిస్తే.. రేవంతు తన తుగ్లక్ పాలనతో అధోగతి పాలు చేస్తున్నడని దుయ్యబట్టారు. . ఒకసారి మూసీ సుందరీకరణ అంటడు, మరోసారి మూసీ ప్రక్షాళన అంటడు, ఇంకోసారి మూసీ పునరుజ్జీవం అంటడు. పూటకో పేరు మార్చుతూ, రోజుకో చోట ప్రజల ఇండ్లు కూల్చే హక్కు మీకు ఎవరు ఇచ్చారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన మీద చిత్తశుద్ధి ఉన్న వారెవరు మొదలు మొదలే పేదల ఇండ్ల మీద పదరు . వికారాబాద్ నుంచి ఇక్కడి వరకు మురుగు నీటిని ఆపకుండా ప్రక్షాళన ఎలా చేస్తవు ? అంటూ నిలదీశారు. ఖజానా ఖాళీ అంటూనే, లక్షా 50వేల కోట్లకు టెండర్ పెట్టాడని విమర్శించారు. మూసీని బాగు చేయలనే చిత్తశుద్ధి ఉంటే మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోవాలని, స్టార్ హోటల్లలో, నీ జూబ్లీ హిల్స్ ప్యాలెస్ లో ఏసీల్లో కూర్చొని కాగితాలు తిరగేస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. ఎలాంటి డీపీఆర్ , ప్రణాళిక లేకుండా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలను కూల్చుతూ, భయభ్రాంతులకు గురి చేయడం దారుణమని అన్నారు.

# రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది

**సీఎం బినామీలపై దర్యాప్తు జరపండి**

**కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కేటీఆర్ బహిరంగ లేఖ**



**హైదరాబాద్,మార్చి13 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు. తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు. రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

# తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

**డిమాండ్లతో కూడిన నోటీస్ ఇచ్చిన జెఎసి**

**హైదరాబాద్,మార్చి13 :** తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. శుక్రవారం నాడు బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తరువాత నిర్ణయం తీసుకుంటామని.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని జేఏసీ నేతలు తేల్చి చెప్పారు.తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను వెంటనే చేపట్టాలన్నారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి. మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలి.పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలి.ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి. అన్ని కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

# ట్రిపుల్ ఐటి ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

**మార్చి 16న నోటిఫికేషన్**

**18 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల పక్రియ**

**నిర్మల్,మార్చి13 :** తెలంగాణలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాల షెడ్యూల్‌ను ఆర్జీయూకేటీ బాసర వీసీ గోవర్దన్ శుక్రవారం విడుదల చేశారు. దీని ప్రకారం.. మార్చి 16న నోటిఫికేషన్, మార్చి 18 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల పక్రియ కొనసాగనుంది. అర్హులైన అభ్యర్థులు టీజీఆన్‌లైన్ సెంటర్లు/మీసేవ/యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రొవిజినల్ జాబితాను మే 30న ప్రకటించి తొలి విడత కౌన్సెలింగ్‌ను జూన్ 5న నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు. ఈ షెడ్యూల్ విడుదల కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ. మురళీ దర్శన్, ప్రవేశాల కన్వీనర్ శీలం శేఖర్, కో-కన్వీనర్ బండి హరికృష్ణ, అసోసియేట్ డీన్‌లు డా.మహేష్, డా. విఠల్, డా.దేవరాజ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొండేగారి రాములు కన్నుమూత

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం

**హైదరాబాద్,మార్చి13 :** ఇబ్రహీం పట్నం మాజీ ఎమ్మెల్యే కొండేగారి రాములు కన్నుమూశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 1989, 1994లో రెండుసార్లు సీపీఎం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీసీ సంక్షేమశాఖ శాసనసభ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో తన ఇంట్లో కుటుంబంతో కలిసి సాధారణ జీవితం గడుపుతున్నారు. కేవలం ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌పైనే ఆయన కాలం వెల్లదీశారు. రాములు మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కూలీ పని చేసిన శ్రమజీవిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా ఎదిగి, ప్రజాదరణతో రెండు దఫాలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచి, నిరాడంబర జీవితాన్ని గడిపిన ప్రజల మనిషి కొండేగారి రాములు అని ప్రశంసించారు. ఆయన రాజకీయ జీవితం, రేపటి తరానికి ఆదర్శవంతమైనది అని కొనియాడారు. శోకతప్తులైన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాములు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ముగిసిన ఇంటర్ పరీక్షలు

## ప్రశాంతంగా ముగిసాయన్న బోర్డు

**హైదరాబాద్,మార్చి13 :** రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమైన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు పగడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి వెల్లడించారు. నిరంతర నిఘా, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిఘాను పటిష్టంగా అమలు చేయడం, పరీక్ష కేంద్రాల తనిఖీల వల్ల మాల్ ప్రాక్టీస్ కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. గత ఏడాది 2025లో రాష్ట్రవ్యాప్తంగా 115 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదవగా ఈ యేడాది 54 మాత్రమే కేసులు నమోదయ్యానట్లు వివరించారు. స్టేట్ అబ్జర్వర్లు, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు 10,426 కేంద్రాలను సందర్శించారని పేర్కొన్నారు. గత ఏడాది కంటే 1,876 కేంద్రాలను అధికంగా సందర్శించారని వివరించారు.

# ఆవిష్కరణలు, పెట్టుబడులకు

## గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,మార్చి13 :** ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రి÷-జడెస్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళ్తుందని శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# భారతి బిల్డర్స్ సంస్థకు భారీ జరిమానా

**హైదరాబాద్,మార్చి13 :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్' ప్రాజెక్టుకు సంబంధించి భారతీ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ కఠిన చర్యలు తీసుకుంది. కొనుగోలుదారులు దాఖలు చేసిన ఫిర్యాదులను విచారించిన అథారిటీ, బిల్డర్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. 2021లో ప్రీ-లాంచ్ ఆఫర్ల ద్వారా కొనుగోలుదారుల నుండి భారీ మొత్తంలో నిధులు వసూలు చేసిన ప్రమోటర్, 24 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చి విఫలమయ్యారు. కనీస చట్టబద్ధమైన అనుమతులు గానీ, రెరా రిజిస్ట్రేషన్ గానీ లేకుండానే నిధులు సేకరించడం మరియు ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై అథారిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. క్రమంలో, ప్రాజెక్టు పూర్తి అయ్యే సూచనలు కనిపించని నేపథ్యంలో, కొనుగోలుదారులు ఆ ప్రాజెక్టులో కొనసాగాల్సిన అవసరం లేదని అథారిటీ స్పష్టం చేసింది. బాధితులు చెల్లించిన పూర్తి మొత్తాన్ని తెలంగాణ రియల్ ఎస్టేట్ రూల్స్-2017 (రూల్ 15) ప్రకారం వడ్డీతో కలిపి 60 రోజుల్లో వాపసు చేయాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్టు అభివృద్ధిలో భాగస్వామ-ులైన మరో శ్రీ భారతి అనే సంస్థను సైతం ప్రమోటర్లుగా పరిగణిస్తూ, ఈ సంస్థలన్నీ ఉమ్మడిగా ఈ నగదును చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ వ్యవహారంలో చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను భారతి బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 'డిఫాల్టర్ ప్రమోటర్‌గా ప్రకటించడమే కాకుండా, రూ. 3,55,63,297 భారీ జరిమానాను కూడా విధించింది. గతంలో ఇవే ఉల్లంఘనలకు సంబంధించి విధించిన రూ. 1,18,54,432 కోట్ల జరిమానాకు ఇది అదనమని పేర్కొంది.రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులలో 'ప్రీ-లాంచ్' ఆఫర్లు లేదా స్కీమ్‌లు చట్టం ప్రకారం పూర్తిగా నిషేధమని, అటువంటి పథకాల్లో పాల్గొనవద్దని కొనుగోలుదారులను తెలంగాణ రెరా హెచ్చరించింది. ఇటువంటి స్కీమ్‌ల ద్వారా రియల్ ఎస్టేట్ చట్టం ద్వారా లభించే కీలక రక్షణలను కొనుగోలుదారులు కోల్పోతారు. ముఖ్యంగా, రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టు నిర్మాణంలో అథారిటీ పర్యవేక్షణ ఉండదు. ఎ÷-లానింగ్ అథారిటీ వద్ద ప్రాజెక్టు విస్తీర్ణంలో 10? విస్తీర్ణాన్ని మార్టిగేజ్ (తనఖా) చేయడం ద్వారా లభించే నియంత్రణ రక్షణలు, మరియు రెరా రిజిస్టర్డ్ ప్రాజెక్టులకు వర్తించే 'ఎస్క్రో' ప్రత్యేక బ్యాంకు ఖాతా నిబంధనల వంటి ఆర్థిక భద్రతలను కూడా కొనుగోలుదారులు పొందలేరని పేర్కొన్నది. అందువల్ల, కొనుగోలుదారులు ఏదైనా లావాదేవీ చేసే ముందు, సదరు ప్రాజెక్టు యొక్క రిజిస్ట్రేషన్ ను అధికారిక పోర్టల్ లో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని అథారిటీ స్పష్టం చేసింది.

# కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

## అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోదీ



**గువాహటి,మార్చి13 :** అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరాఝార్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనీషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు.

అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. దీనికి ముందు, అస్సాంలో రెండ్రోజుల పర్యటన కోసం గౌహతి వచ్చిన మోదీకి రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు సాదర స్వాగతం పలికారు.

### ఇరాన్ అధ్యక్షుడు మసౌద్‌కు ప్రధాని మోదీ ఫోన్

**న్యూఢిల్లీ,మార్చి13 :** ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మ-రోసారి ఫోన్ చేశారు. పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ తీవ్రత పెరగడం, యుద్ధంలో సామాన్య ప్రజలు, పౌరుల ఆస్తులు ధ్వంసం కావడంపై మోదీ విచారం వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతల నడుమ ఇరువైపులా ఎవరూ వెనక్కి తగ్గని నేపథ్యంలో పరిస్థితులు విపరీత పరిణామాల వైపు దారితీస్తుం డటంపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారాయన. 'ఇరాన్ ప్రెసిడెంట్ డాక్టర్ మసౌద్ పెజెష్కియాన్‌తో ప్రాంతీయ పరిస్థితులపై చర్చించాను. అక్కడ ఉద్రిక్తతలు పెరగడం, పౌరుల ప్రాణనష్టం అలాగే పౌర మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లడంపై ఆందోళన చెందాను. భారతీయ పౌరుల భద్రత, వస్తువులు, నిరంతర ఇంధన సరఫరా వంటివి భారత్ ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయి. అంతేకాకుండా.. శాంతి, స్థిరత్వానికి దేశం నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, సమస్యల పరిష్కారం కోసం చర్చలు, దౌత్యపరమైన జోక్యం అవసరమన్నాను' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా.. ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం నేటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు యుద్ధానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో పది రోజుల వ్యవధిలో మోదీ ఆయా పశ్చిమాసియా దేశాల నేతలతో సంభాషించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు ప్రారంభమైన వేళ ఇరాన్ ప్రధాని పెజెష్కియాన్‌తో తొలిసారి మాట్లాడారు మోదీ.

# మహిళలకు నెలసరి సెలవులతో సమస్య

## వారికి ఎవ్వరూ ఉద్యోగాలివ్వరేమో.. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అనుమానం



**న్యూఢిల్లీ,మార్చి13 :** మహిళలకు తప్పనిసరిగా నెలసరి సెలవులు ఇస్తే, దాని వల్ల మహిళలకే సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశాలు ఉన్నాయని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ బహిష్టు సమయంలో మహిళలకు లీవులు తప్పనిసరిగా ఇవ్వాలన్న చట్టాన్ని అమలు చేస్తే దాని వల్ల ఎవరు కూడా మహిళలను ఉద్యోగంలోకి తీసుకోరేమో అని సీజేఐ పేర్కొన్నారు. అలాంటి చట్టాలు తయారు చేయడం వల్ల పనిచేస్తున్న మహిళల్లో మానసికమైన భయాందోళనలు కలిగే అవకాశాలు ఉన్నట్లు కోర్టు తెలిపింది. పురుషుల కన్నా తాము తక్కువ అన్న భావన వారిలో కలుగుతుందని సీజే తెలిపారు. మహిళలకు నెలసరి సమయంలో కచ్చితంగా లీవులు ఇవ్వాలన్న చట్టాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి తన పిటీషన్‌లో కోరారు. ఈ నేపథ్యంలో ఇవాళ విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం.. అలాంటి చట్టాలతో మహిళలకే సమస్య వస్తుందని పేర్కొన్నది.రుతుక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, భిన్నమైన రీతిలో ఆ అంశాలపై సెన్సిటైజ్ చేయాలని, కానీ నెలసరి లీవులను తప్పనిసరి చేస్తూ చట్టాలను రూపొందిస్తే, అప్పుడు మహిళలను ఎవరూ ఉద్యోగంలో నియమించుకోలేరని సీజేఐ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీం ధర్మాసనం పిటీషనర్‌కు వార్నింగ్ ఇచ్చింది. ఉద్యోగాలు ఇచ్చే వ్యక్తుల మైండ్‌సెట్ మీకు తెలియదని, ఇలాంటి చట్టాలు చేస్తే, వాళ్లు మహిళలను రిక్రూట్ చేసుకోరని సీజే తన తీర్పులో అన్నారు. విద్యార్థినులైనా వర్కింగ్ ప్రొఫెషనల్స్ అయినా .. నెలసరి సమయంలో మహిళలకు లీవులు ఇవ్వాలని పిటీషనర్ కోరారు. అయితే ఇలాంటి అభ్యర్థనల వల్ల భయాందోళనలు పెరుగుతాయని చీఫ్ జస్టిస్ అన్నారు. మహిళలను బలహీనులుగా చూస్తారని, నెలసరి వల్ల వారికి ఏదో చెడు జరుగుతుందని భావిస్తారన్నారు. సీనియర్ అడ్వకేట్ ఎంఆర్ షాంషాద్ మాట్లాడుతూ.. 2013లో కేరళ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని గుర్తు చేశారు. అన్ని వర్సిటీలకు చెందిన మహిళా విద్యార్థినులకు నెలసరి లీవులు మంజూరీ చేసిందని, సీఎం పినరయి విజయన్ సర్కారు ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు. ప్రైవేటు కంపెనీలు కూడా ఇలాంటి సడలింపులు ఇచ్చినట్లు అడ్వకేట్ షంషాద్ తెలిపారు. అయితే ఈ అంశంపై చీఫ్ జస్టిస్ స్పందిస్తూ.. అవన్నీ ఆ క్షణం తీసుకున్న నిర్ణయాలని, ఒకవేళ తప్పనిసరి చేస్తూ చట్టాన్ని రూపొందిస్తే, అప్పుడు మహిళలకు ఎవరూ ఉద్యోగాలు ఇవ్వరని అన్నారు. న్యాయవ్యవస్థలో కానీ, గవర్నమెంట్ ఉద్యోగాల్లో కానీ వాళ్లను తీసుకోరన్నారు. వాళ్ల కెరీర్ ముగుస్తుందని, ఇంటి వద్దే కూర్చోవాలని అంటారన్నారు.

# ఆకలిగా ఉందని పకోడి తెమ్మన్న భార్య

## తీసుకుని వచ్చే సరికి ప్రియుడితో ఉడాయింపు

## యూపిలో అరుదైన ఘటన

**లక్నో,మార్చి13 :** భర్తను పకోడి తెమ్మనిచెప్పి పంపిన భార్య అతను తిరిగి వచ్చేసరికి ప్రియుడితో జంప్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలే పెళ్లయిన ఈ యువ జంట బస్సులో బస్టాండ్‌కు చేరుకున్నారు. మరో బస్సు ఎక్కేందుకు వేచి ఉన్నారు. తనకు ఆకలిగా ఉన్నదని పకోడీలు తీసుకురావాలని భర్తకు భార్య చెప్పింది. అతడు కొని తెచ్చేసరికి మరో వ్యక్తితో ఆమె పారిపోయింది. దీంతో భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అమ్రోహా జిల్లాకు చెందిన ప్రీతమ్ సింగ్‌కు రాంపూర్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల రిమ్‌జిమ్‌తో గత ఏడాది డిసెంబర్ 1న పెళ్లి జరిగింది. ఇటీవల హోలీ పండగ కోసం ఆమె తన పుట్టింటికి వెళ్లింది. కాగా, భార్యను ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రీతమ్ సింగ్ అత్తవారింటికి వెళ్లాడు. మార్చి 9న భార్య రిమ్‌జిమ్‌తో కలిసి బస్సులో ప్రయాణించాడు. మరో బస్సు మారేందుకు బిలారి బస్టాండ్ వద్ద వారు దిగారు. తమ ఊరు వెళ్లే బస్సు కోసం వేచి ఉన్నారు. మరోవైపు తనకు ఆకలిగా ఉన్నదని, వేడివేడి పకోడీలు తీసుకురమ్మని భర్త ప్రీతమ్ సింగ్‌కు భార్య రిమ్‌జిమ్ చెప్పింది. దీంతో బస్టాండ్ చివరలో ఉన్న షాపు వద్దకు అతడు వెళ్లాడు. పకోడీలు కొని తిరిగి వచ్చేసరికి భార్య కనిపించలేదు. మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో ఆందోళన చెందాడు. ఆమె కోసం బస్టాండ్ అంతా వెతికాడు. అక్కడున్న వారిని ఆరా తీశాడు. ఒక వ్యక్తితో కలిసి భార్య వెళ్లినట్లు తెలుసుకున్నాడు కాగా, ఆందోళన చెందిన ప్రీతమ్ సింగ్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేశాడు. ఆమె గ్రామానికి చెందిన యువకుడితో కలిసి పారిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రిమ్‌జిమ్ మొబైల్ ఫోన్ ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బస్టాండ్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

# అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి

## ప్రకటించిన ఇరాన్..తిప్పి కొట్టిన అమెరికా

**టెహ్రాన్,మార్చి13 :** అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ యుద్ధ విమానాన్ని ఢీకొట్టాయని వెల్లడించింది. దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొంది. అయితే అమెరికా ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఇరాన్‌పై అమెరికా చేస్తోన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి ఈ నౌక మద్దతు ఇస్తూనే ఉందంటూ ఇరాన్ ప్రకటనలను ఖండించింది. ఈమేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. అమెరికా మీడియా కథనాల ప్రకారం.. అబ్రహం లింకన్‌కు అతిదగ్గరగా ఓ ఇరాన్ పడవ వచ్చింది. దానిని గుర్తించిన అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో యూఎస్ నౌక దెబ్బతిన్నదా, లేదా అని మాత్రం పేర్కొనలేదు. ఇక, ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ సేనలు దీనిని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు తరలించాయి. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. యుద్ధం ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నాలుగు క్షిపణులతో దాడి చేశామని చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. అయితే ఆ ప్రకటనలో నిజం లేదని అప్పుడు కూడా అమెరికా తోసిపుచ్చింది. ఇరాన్ వద్ద భారీస్థాయిలో హైపర్‌సోనిక్, నౌకా విధ్వంసక క్షిపణులు ఉన్నప్పటికీ అవి అమెరికన్ విమాన వాహక నౌకను తాకడం దాదాపుగా అసాధ్యమనే చెబుతుంటారు. విమాన వాహక నౌక ప్రధాన బలం దాని మీద ఉండే యుద్ధ విమానాలే. యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్, ఎఫ్-35సి స్టెల్త్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అనేక విమానాలు ఉన్నాయి. ఇవి శత్రువుపై దాడి చేయడంతోపాటు విమాన వాహకనౌకను రక్షించే సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. పోరు సమయంలో విమాన వాహక నౌక సాగరంలో స్థిరంగా ఉండదు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో కదులుతుంటుంది. రియల్‌టైమ్ ఉపగ్రహ నెట్‌వర్క్ లేకుండా దీని జాడను ఎప్పటికప్పుడు పసిగట్టడం కష్టం. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో.. ఇరాన్ తీరానికి దూరంలో వ్యూహాత్మక ప్రదేశంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. 'జెరాల్డ్‌లోని లాండ్రీ ప్రదేశాల్లో ఈ మంటలు చెలరేగాయి. అయితే అందుకు యుద్ధం కారణం కాదు. ఆ మంటలను ఆర్పేశాం. నౌకలోని ప్రొపల్షన్ ప్లాంట్‌కు ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. గాయపడిన ఇద్దరు నావికులకు చికిత్స అందుతోంది. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నౌక ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఎర్రసముద్రంలో తన సహకారాన్ని కొనసాగిస్తోందని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.



## ఈ ప్రపంచకప్ యావత్ భారత్ ది

**కెప్టెన్ సూర్యకుమార్**

2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా చారిత్రక విజయం సాధించిన నేపథ్యంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ యావత్ దేశ ప్రజలకు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. ఈ టైటిల్‌ను టోర్నమెంట్ ఆద్యంతం జట్టుకు అండగా నిలిచిన కోట్లాది మంది మద్దతుదారులకు అంకితమిస్తున్నట్టు భావోద్వేగంతో ప్రకటించాడు. ఈ మేరకు బీసీసీఐ తాజాగా విడుదల చేసిన ఒక వీడియోలో ఆయన మాట్లాడాడు. అభిమానుల ప్రార్థనలు, ప్రోత్సాహం లేకపోతే ఈ విజయం సాధ్యమయ్యేది కాదని సూర్యకుమార్ అన్నాడు. "ప్రియమైన టీమిండియా అభిమానులారా, ముందుగా మీ అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మీ మద్దతు, ఆశీస్సుల వల్లే మేం ఉన్నాం. ఈ ప్రపంచకప్ ట్రోఫీ యావత్ భారతదేశానిది" అని ఆయన పేర్కొన్నాడు. ఈ విజయం కేవలం జట్టుది మాత్రమే కాదని, దేశంలోని క్రికెట్ ప్రేమికులందరి కల అని ఆయన అభివర్ణించాడు. "మేం గెలిచినప్పుడు, అది మా విజయం మాత్రమే కాదు. బ్యాట్, బంతితో పెరిగి దేశం కోసం ఆడాలని కలలు కనే ప్రతీ చిన్నారి కల అది. స్టేడియాలను నింపేసి, వాటిని సొంత ఇంటిలా మార్చేసే అభిమానులది. ఇళ్లలో ఉండి మమ్మల్ని ఆదరించే కోట్లాది మందిది" అని సూర్యకుమార్ వివరించాడు. టోర్నీలో ఎదురైన క్లిష్ట సమయాల్లో అభిమానుల ప్రార్థనలు, బేషరతు ప్రేమ తమకు ఎంతో బలాన్ని ఇచ్చాయని ఆయన గుర్తుచేసుకున్నాడు. "మీ ప్రార్థనలు, ప్రేమకు మా కృతజ్ఞతలను మాటల్లో చెప్పలేం. చివరిగా ఒక్కటే చెబుతున్నా, భారత్‌లో క్రికెట్ కేవలం ఆట కాదు, అదొక ఎమోషన్. ఈ విజయం మీ అందరిది" అంటూ సూర్య ముగించాడు. ఆదివారం నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో భారత్ మూడు టీ20 ప్రపంచకప్ టైటిళ్లు గెలిచిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. అలాగే, స్వదేశంలో టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా కూడా చరిత్రకెక్కింది. ఈ విజయంతో సూర్యకుమార్ యాదవ్ కూడా ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మల తర్వాత టీ20 ప్రపంచకప్‌ను కెప్టెన్‌గా గెలిచిన ప్రత్యేక క్లబ్‌లో చేరాడు.

# ఐపీఎల్ ఫ్రాంచైజీలకు బీసీసీఐ కఠిన నిబంధనలు

## ప్రాక్టీస్‌పై కొత్త రూల్స్!

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి బీసీసీఐ, ఫ్రాంచైజీలకు పలు కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా జట్ల ప్రాక్టీస్ సెషన్ల విషయంలో పారదర్శకత, సమాన అవకాశాలు కల్పించే దిశగా కొత్త నిబంధనలను ప్రకటించింది. దీని ప్రకారం ఒక జట్టు ప్రాక్టీస్ చేసిన పిచ్‌ను లేదా నెట్స్‌ను మరో జట్టు తమ సెషన్ కోసం ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. బీసీసీఐ జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం ప్రతి జట్టుకు వారి ప్రాక్టీస్ సెషన్ కోసం తాజాగా సిద్ధం చేసిన నెట్స్‌ను మాత్రమే కేటాయించాలి. ఒకే సమయంలో గానీ, లేదా ఒకరి తర్వాత మరొకరు గానీ ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు, మొదటి జట్టు వాడిన నెట్స్‌ను రెండో జట్టు ఉపయోగించడానికి వీల్లేదు. ఒకవేళ ఒక జట్టు ముందుగా ప్రాక్టీస్ ముగించినప్పటికీ, వారి రేంజ్-హిట్టింగ్ వికెట్‌ను లేదా నెట్స్ (త్రో-డౌన్స్‌తో సహా)ను రెండో జట్టు వాడకూడదని పేర్కొంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లపైనా బీసీసీఐ స్పష్టమైన సూచనలు చేసింది. ఫ్రాంచైజీలు గరిష్ఠంగా రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుకోవచ్చు. అయితే, ఈ సమాచారాన్ని ముందుగానే బీసీసీఐకి తెలియజేయాలి. ఈ మ్యాచ్‌లను అసలు మ్యాచ్ కోసం సిద్ధం చేసిన పిచ్‌పై నిర్వహించకూడదు. ఒకవేళ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడాలనుకుంటే, దాని వ్యవధి మూడున్నర గంటలకు మించరాదని కూడా బీసీసీఐ నిర్దేశించింది. సీజన్‌లో ఒక ఫ్రాంచైజీ తమ తొలి హోమ్ మ్యాచ్ ఆడేందుకు నాలుగు రోజుల ముందు నుంచి ప్రధాన స్క్వేర్‌పై ఎలాంటి ప్రాక్టీస్ సెషన్లు లేదా మ్యాచ్‌లు నిర్వహించరాదు. ఈ సమయంలో హోమ్ ఫ్రాంచైజీ కోరితే, సంబంధిత రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఎలాంటి రుసుము లేకుండా ప్రత్యామ్నాయ ప్రాక్టీస్ గ్రౌండ్‌ను అందుబాటులో ఉంచాలని సూచించింది. ప్రాక్టీస్ కోసం రెండు జట్లకు చెరో రెండు నెట్స్, రేంజ్ హిట్టింగ్ కోసం ప్రధాన స్క్వేర్‌పై ఒక నెట్‌ను కేటాయిస్తారు. ప్రాక్టీస్ షెడ్యూల్ విషయంలో ఏవైనా వివాదాలు తలెత్తితే, విజిటింగ్ జట్టుకే ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసింది. సాధారణంగా హోమ్ జట్టుకే తొలి ప్రాధాన్యం ఉన్నప్పటికీ, విజిటింగ్ జట్టు ప్రయాణ ఏర్పాట్లు, ముందు రోజు మ్యాచ్ ఆడి ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వారి అభ్యర్థనను గౌరవిస్తామని తెలిపింది.






## రోహిత్, కోహ్లీ కోసం మరిన్ని వన్డేలు..

**2027 వన్డే వరల్డ్ కప్‌పై బీసీసీఐ ఫోకస్**

రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా భారత జట్టు ఇకపై మరిన్ని వన్డే మ్యాచ్‌లు ఆడేలా వ్యూహం రచిస్తోంది. మే నెలలో ఐపీఎల్ ముగిసిన తర్వాత టీమిండియా పూర్తి దృష్టిని వన్డే క్రికెట్‌పై పెట్టనుంది. ఇటీవలి కాలంలో భారత్ రెండు టీ20 ప్రపంచకప్‌లు, ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినప్పటికీ 2011 నుంచి వన్డే ప్రపంచకప్ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. 2023లో సొంతగడ్డపై జరిగిన టోర్నీలో ఫైనల్ వరకు దూసుకెళ్లినా, ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 16 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ 2027లో కప్ గెలవాలనే పట్టుదలతో బీసీసీఐ ఉంది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రకారం విదేశీ పర్యటనల్లో అదనపు వన్డేలు ఆడించేందుకు పలు దేశాల క్రికెట్ బోర్డులు బీసీసీఐ ముందు ప్రతిపాదనలు ఉంచాయి. ఈ ప్రతిపాదనలకు బీసీసీఐ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం ద్వారా వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి వారికి ప్రపంచకప్ కోసం మెరుగ్గా సిద్ధమయ్యేందుకు అవకాశం లభిస్తుంది. మరిన్ని మ్యాచ్‌లు ఆడటం వారి ఫామ్, ఫిట్‌నెస్‌కు దోహదపడుతుందని బోర్డు భావిస్తోంది. ఐపీఎల్ ముగిశాక భారత జట్టు స్వదేశంలో ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్ట్, మూడు వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లి అక్కడ మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌లో పాల్గొంటుంది. ఈ పర్యటనలోనే ఐర్లాండ్‌తో కూడా మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. మరోవైపు తమతో పరిమిత ఓవర్ల సిరీస్ ఆడాలని శ్రీలంక క్రికెట్ బోర్డు కూడా బీసీసీఐని అభ్యర్థించినట్లు సమాచారం. ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్ (ఖీఊ) ప్రకారం బంగ్లాదేశ్, వెస్టిండీస్, న్యూజిలాండ్‌తో కూడా సిరీస్‌లు జరగనున్నాయి. ముఖ్యంగా న్యూజిలాండ్ తమ పర్యటనలో అదనపు వన్డేలు చేర్చాలని కోరినట్లు తెలుస్తోంది.

## ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ కావొచ్చు: ఇర్ఫాన్ పఠాన్



చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) దిగ్గజ ఆటగాడు, వికెట్ కీపర్ బ్యాటర్ ఎంఎస్ ధోనీకి రాబోయే ఐపీఎల్ సీజనే చివరిది కావొచ్చని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. చెన్నై జట్టుకు ధోనీ ప్రాముఖ్యతను వివరిస్తూ, అతను లేకుండా సీఎస్కేను, ఐపీఎల్‌ను ఊహించుకోవడం చాలా కష్టమని అన్నాడు. జియో హాట్‌స్టార్‌తో మాట్లాడుతూ ఇర్ఫాన్ పఠాన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "ధోనీ లేనిదే సీఎస్కే అసంపూర్ణం. ఈ సీజన్‌లోనే అతడిని చివరిసారిగా ఎల్లో జెర్సీలో చూస్తామేమో. డ్రెస్సింగ్ రూమ్‌లో అతని ఉనికి జట్టుకు ఎంతో మేలు చేస్తుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ, భవిష్యత్తు కోసం మరో ఇద్దరు, ముగ్గురు ఆటగాళ్లను తీర్చిదిద్దడంలో ధోనీ పాత్ర చాలా కీలకం. అతను ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడో కచ్చితంగా చెప్పలేను, కానీ జట్టును ఐక్యంగా ఉంచడంలో సాయపడతాడు" అని వివరించాడు. ధోనీ ఫిట్‌నెస్, వర్క్‌లోడ్ వంటి విషయాల్లో సీఎస్కే యాజమాన్యం జాగ్రత్తగా వ్యవహరిస్తుందని పఠాన్ పేర్కొన్నాడు. ఆరోసారి ఐపీఎల్ టైటిల్ గెలిచి తమ అభిమాన 'తలా'కు ఘనమైన వీడ్కోలు పలకాలని జట్టు యాజమాన్యం గట్టిగా కోరుకుంటుందని జోస్యం చెప్పాడు. ఐదుసార్లు టైటిల్ అందించిన ధోనీ, సీఎస్కే నాయకత్వ బృందంలో ఇప్పటికీ కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు. గత సీజన్‌లో చెన్నై జట్టు పేలవ ప్రదర్శన కనబరిచింది. ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 మాత్రమే గెలిచి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడైన ధోనీ, ఇప్పటివరకు 278 మ్యాచ్‌లలో 38.80 సగటుతో 5,439 పరుగులు చేశాడు.

## చెన్నై సూపర్ కింగ్స్‌పై రూ.1 కోటికి దావా వేసిన సన్ టీవీ నెట్ వర్క్




సన్ టీవీ నెట్ వర్క్, ఐపీఎల్ జట్టు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)పై మద్రాస్ హైకోర్టులో కాపీరైట్ ఉల్లంఘన దావా వేసింది. తమ అనుమతి లేకుండానే జైలర్, జైలర్-2, కూలీ సినిమాల్లోని బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, ఆడియో ట్రాక్‌లు, డైలాగులను సీఎస్కే తమ ప్రచార వీడియోలో వాడుకుందంటూ రూ.1 కోటికి దావా వేసింది. వాణిజ్యపరంగా వాటిని ఉపయోగించడం కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపింది. సీఎస్కే ఉపయోగించిన కంటెంట్ కాపీరైట్ రక్షణ పరిధిలో ఉందని, దీనిని వినియోగించుకోవాలంటే తమ ముందస్తు అనుమతి తప్పనిసరి అని ఆ చిత్రాల నిర్మాతలు హైకోర్టుకు తెలిపారు. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో తాము చేసుకున్న ఒప్పందాలను హైకోర్టుకు వారు సమర్పించారు. కాపీ రైట్ కలిగిన కంటెంట్‌ను సీఎస్కే అనధికారికంగా వినియోగిస్తోందని మార్చి 1న మెయిల్ కూడా పంపించామని, దాంతో తమ మెటిరీయల్ వినియోగాన్ని సీఎస్కే నిలిపివేసిందని సన్ టీవీ తరఫున రవీంద్రన్ పేర్కొన్నారు. సంగీత దర్శకుడు అనిరుధ్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం హక్కులన్నీ తమకే చెందుతాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. తాము ఇప్పటికే ఆ కంటెంట్‌ను నిలిపివేశామని చెన్నై సూపర్ కింగ్స్ కూడా హైకోర్టుకు తెలిపింది. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఆంక్షలు మరియు జరిమానాలపై నిర్ణయం తీసుకోవడానికి ముందు మరోసారి ఇరుపక్షాల వాదనలను వినాలని నిర్ణయించింది.

## పాక్ ఆటగాడిని కొనుగోలు చేసిన కావ్యా మారన్

**మండిపడుతున్న అభిమానులు**




ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' పురుషుల లీగ్ వేలంలో పాకిస్థాన్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేయడం పెద్ద వివాదానికి దారితీసింది. గురువారం జరిగిన వేలంలో అబ్రార్‌ను రూ. 2.34 కోట్లకు (190,000 పౌండ్లు) దక్కించుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ జట్టు యజమాని అయిన సన్ టీవీ గ్రూప్‌కు చెందినదే ఈ ఫ్రాంచైజీ కావడంతో, ఈ నిర్ణయంపై భారత అభిమానులు సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అబ్రార్ అహ్మద్ టీ తాగుతున్న ఫొటోతో, ఆసియా కప్‌లో అనుచిత సంబరాలతో భారత్‌ను, భారత ఆటగాళ్లను ఎగతాళి చేశాడని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. "భారత్‌ను అవమానించిన ఆటగాడిని కొనడం సిగ్గుచేటు" అంటూ సన్‌రైజర్స్ ఫ్రాంచైజీపైనా, ఆ ఫ్రాంచైజీ యజమాని కావ్యా మారన్ పైనా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నిర్ణయంతో ఫ్రాంచైజీ పరువు పోయిందని పలువురు కామెంట్లు పెడుతున్నారు. 2009 నుంచి ఐపీఎల్‌లో పాకిస్థానీ ఆటగాళ్లు ఆడటం లేదు. ఇతర దేశాల లీగ్స్‌లో కూడా భారత ఫ్రాంచైజీ యజమానులు పాక్ ఆటగాళ్లను తీసుకోవడానికి దూరంగా ఉంటారు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ లీడ్స్ పాక్ ఆటగాడిని తీసుకోవడం చర్చనీయాంశమైంది. గతంలో నార్తర్న్ సూపర్‌చార్జర్స్‌గా ఉన్న ఈ జట్టును ఇటీవలే సన్ టీవీ గ్రూప్ కొనుగోలు చేసి సన్‌రైజర్స్ లీడ్స్‌గా మార్చింది. అయితే, ఆటగాళ్ల ఎంపిక కేవలం వారి ఆటతీరు, లభ్యత, జట్టు అవసరాలపైనే ఆధారపడి ఉంటుందని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) స్పష్టం చేసింది. ఇదే వేలంలో మరో పాక్ ఆటగాడు ఉస్మాన్ తారిఖ్‌ను బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ కొనుగోలు చేయగా, హారీస్ రవూఫ్, షాదాబ్ ఖాన్ వంటి స్టార్ ప్లేయర్లు అమ్ముడుపోలేదు. అబ్రార్‌తో పాటు సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు జాక్ క్రాలీ, ర్యాన్ రికెల్టన్, మాట్ పాట్స్ వంటి ఆటగాళ్లను కూడా కొనుగోలు చేసింది. ఈ జట్టుకు హ్యారీ బ్రూక్ కెప్టెన్‌గా ఉన్నాడు.

# ఓటిటిలోకి రవితేజ భర్త మహాశయుకలు విజ్ఞప్తి

## మాస్ కాదాస్ ఫంకీ



మాస్ మహారాజా రవితేజ హీరోగా తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు' చివరకు ఓటిటిలోకి వచ్చేసింది. దర్శకుడు కిషోర్ తిరుమల రూపొందించిన ఈ సినిమాలో హీరోయిన్లుగా ఆషిక రంగనాథ్, డింపుల్ హయతి నటించారు. ఈ చిత్రం ఈ ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలై మంచి స్పందనను అందుకుంది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డీసెంట్ కలెక్షన్స్ సాధించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రవితేజ స్టైల్ మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉండటంతో ప్రేక్షకులు సినిమాను బాగా ఆదరించారు. మాస్ మహారాజా గత కొన్ని సినిమాలతో పోలిస్తే ఈ సినిమా థియేటర్లలో మంచి రన్‌ను నమోదు చేసింది. అయితే థియేటర్లలో విడుదలైన తర్వాత ఈ సినిమా ఓటీటీలోకి రావడానికి కొంత సమయం పట్టింది. ఇతర సినిమాలు తక్కువ సమయంలోనే ఓటిటిలోకి వస్తున్న నేపథ్యంలో 'భర్త మహాశయులకు' మాత్రం ఆలస్యంగా డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఇక తాజాగా ఈ సినిమా ఓటిటి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటిటి ప్లాట్‌ఫార్మ్ జిఇఇ5 సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని తెలుగు మాత్రమే కాకుండా తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ప్రేక్షకులకు అందుబాటులో ఉంచారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా కయాదు లోహర్ హీరోయిన్ గా దర్శకుడు అనుదీప్ కే వి తెరకెక్కించిన ఫన్ డ్రామా చిత్రమే 'ఫంకీ' థియేటర్స్ లో ఒక డిజప్పాయింట్ చేయగా, ఈ మూవీ ఓటీటీలో ఈ సినిమా స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ చిత్రాన్ని పాపులర్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఈ సినిమా నేటి నుంచి అందుబాటులోకి వచ్చింది. అనుదీప్ గత సినిమా ప్రిన్స్ కూడా థియేటర్స్ తర్వాత ఓటీటీ లోకి వచ్చాక ఓ వర్గం ఆడియెన్స్ ని ఫ్యాన్స్ చేసుకుంది. మరి అలానే ఫంకీ కి కూడా జరుగుతుందా లేదా అనేది వేచి చూడాలి.




# భరణం తీసుకోని హన్సిక..

## విడాకుల తర్వాత తొలిసారి అలాంటి పోస్ట్



టాలీవుడ్ 'దేశముదురు' బ్యూటీ హన్సిక మోత్వానీ తన వ్యక్తిగత జీవితంలో తీసుకున్న కీలక నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. వ్యాపారవేత్త సోహైల్ కతూరియాతో ఆమె అధికారికంగా విడాకులు తీసుకున్న వార్త అభిమానులను కొంత కలవరపెట్టినా, ఆమె స్పందించిన తీరు మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచింది. విడాకుల తర్వాత తొలిసారిగా సోషల్ మీడియాలో స్పందించిన హన్సిక, తన మనోధైర్యాన్ని చాటుతూ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కష్టాల్లో కూడా పాజిటివ్‌గా ఎలా ఉండాలో ఆమె తన పోస్ట్‌తో నిరూపించింది. ఆ వివరాలు ఇలా వున్నాయి.. చట్టబద్ధంగా విడాకులు మంజూరైన మరుసటి రోజే హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో "చార్ది కలా ఆల్వేస్" (జష్ట్రుఘుతీసఎఱ ఖుశ్రీఖు ఖశ్రీఝుఎం) అని రాసుకొచ్చింది. ఈ పంజాబీ పదానికి అర్థం ఏమిటంటే.. జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా, ఎంతటి కష్టం వచ్చినా అచంచలమైన ధైర్యంతో, సానుకూల దృక్పథంతో ముందుకు సాగడం. తన వైవాహిక బంధం ముగిసినా, తాను కృంగిపోలేదని, రెట్టింపు ఉత్సాహంతో తన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నట్లు ఈ పోస్ట్ ద్వారా క్లారిటీ ఇచ్చేసింది. ఏళ్ల తరబడి సైలెంట్‌గా ఉన్న హన్సిక, ఇలా ఒక్క మాటతో తన మనసులోని ధైర్యాన్ని చెప్పడం విశేషం. హన్సిక విడాకుల విషయంలో మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే, ఆమె తన భర్త నుండి ఎలాంటి భరణం కోరలేదు. ఆర్థిక ప్రయోజనాల కంటే తన ప్రశాంతతకే ఆమె ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చింది. మార్చి 11న ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు వీరికి పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరు చేసింది. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా ఉన్న అభిప్రాయభేదాలు, జీవనశైలిలో మార్పుల వల్ల బంధం దెబ్బతిందని, అందుకే విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు కోర్టు డాక్యుమెంట్లలో పేర్కొన్నారు. ఇక కేవలం ప్రశాంతమైన ముగింపు కోసమే హన్సిక ఎలాంటి డిమాండ్లు చేయకుండా విడాకులకు మొగ్గు చూపినట్లు ఆమె లాయర్ వెల్లడించారు.

# వరుణ్‌తో ఎంగేజ్మెంట్ అందుకే క్యాన్సిల్ చేసుకున్నా : త్రిష



వెండితెరపై దశాబ్దాలుగా నటిస్తున్న స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ మరోసారి వార్తల్లో నిలిచారు. చెన్నైలో జరిగిన ఒక ప్రముఖ నిర్మాత కుమారుడి రిసెప్షన్‌లో నటుడు విజయ్‌తో కలిసి ఆమె కనిపించడం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. అయితే ఈ గాసిప్స్ పక్కన పెడితే, త్రిష తన జీవితంలో తీసుకున్న వ్యక్తిగత నిర్ణయాలు ఆమెకు సినిమాపై ఉన్న అంకితభావాన్ని చాటిచెబుతున్నాయి. ప్రేమ, పెళ్లి కంటే తన వృత్తికే ప్రాధాన్యతనిస్తూ ఆమె తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల గురించి ఇప్పుడు అందరూ ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారు. ఆ విశేషాలు చూద్దాం.. త్రిష వ్యక్తిగత జీవితం గురించి చర్చ వస్తే అందరికీ ముందుగా గుర్తొచ్చేది ఆమె గతంలో రద్దు చేసుకున్న నిశ్చితార్థం. 2015లో వ్యాపారవేత్త వరుణ్ మనియన్‌తో ఆమెకు నిశ్చితార్థం జరిగినప్పటికీ, పెళ్లి పీటల దాకా వెళ్లకుండానే అది ఆగిపోయింది. దీనిపై ఒక ఇంటర్వ్యూలో త్రిష చాలా స్పష్టంగా మాట్లాడారు. తను పెళ్లి చేసుకోబోయే వ్యక్తి సినిమాలకు స్వస్తి చెప్పాలని కండిషన్ పెట్టాడని, అందుకే తాను ఆ పెళ్లి కంటే సినిమాలకే ఓటు వేశానని ధైర్యంగా చెప్పారు. "సినిమాలకు కాదు, నా ఎంగేజ్‌మెంట్‌కే ఫుల్ స్టాప్ పెట్టాను" అని ఆమె చెప్పిన మాటలు ఆమెలోని వృత్తి ప్రేమని చాటుతాయి. ఇక సాధారణంగా హీరోయిన్లకు కెరీర్ స్పాన్ తక్కువగా ఉంటుందని అంటుంటారు. కానీ త్రిష మాత్రం రెండు దశాబ్దాలుగా స్టార్‌గా వెలుగుతూ ఆ మాటను తప్పు అని నిరూపిస్తున్నారు. "నా చివరి శ్వాస వరకు నేను నటిస్తూనే ఉండాలన్నదే నా కోరిక" అని ఆమె చెప్పడం సినిమా పట్ల ఆమెకు ఉన్న అమితమైన ఇష్టాన్ని తెలియజేస్తుంది. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని రూమర్లు వచ్చినా తన పనిపైనే దృష్టి పెట్టడం త్రిష స్టైల్. అందుకే ఆమె నేటి తరం నటీమణులకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తూ, తన కెరీర్‌ను సక్సెస్ ఫుల్ గా ముందుకు తీసుకెళ్తున్నారు. ఇక త్రిష అంటే కేవలం అందం మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసం కూడా అని ఆమె ప్రయాణం చూస్తే అర్థమవుతుంది. తన ఇష్టాలను కాదని చెప్పే బంధాల కంటే, తనను తాను నిరూపించుకునే కెరీరే మిన్న అని ఆమె నిరూపించారు.

# బ్లాక్ ఎథ్నిక్ డ్రెస్సులో సంయుక్త స్టన్నింగ్ లుక్స్..

టాలీవుడ్ 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్ మరోసారి సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది. కేరళ కుట్టిగా తన సహజమైన అందంతో తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న ఈ అమ్మడు, అటు ట్రెడిషనల్ లుక్స్‌లోనూ, ఇటు మోడ్రన్ డ్రెస్సుల్లోనూ తనదైన శైలిలో మెరిసిపోతుంటుంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన బ్లాక్ ఎథ్నిక్ వేర్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. బ్లాక్ దుస్తుల్లో ఆమె రాజసం చూసి నెటిజన్లు 'స్టన్నింగ్ బ్యూటీ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఆ విశేషాలు చూద్దాం.. సంయుక్త మీనన్ అంటేనే ఒక రకమైన క్లాస్ మరియు గ్రేస్ గుర్తొస్తాయి. తాజాగా ఆమె షేర్ చేసిన చిత్రాల్లో సంప్రదాయబద్ధమైన నల్లటి ఎథ్నిక్ దుస్తుల్లో సంయుక్త మెరిసిపోయింది. రిచ్ వర్క్ ఉన్న ఆ డ్రెస్సులో ఆమె లుక్ చాలా రాయల్‌గా కనిపిస్తోంది. ఇక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ భామ, తన ఫ్యాషన్ సెన్స్‌తో ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్స్ సెట్ చేస్తోంది. ముఖ్యంగా ఈ బ్లాక్ అవుట్‌ఫిట్‌లో ఆమె ఇచ్చిన పోజులు కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. నటనతోనే కాదు, తన స్టైలిష్ అవతార్‌లతో కూడా తను నెక్స్ట్ లెవల్ అని ఈ కేరళ కుట్టి మరోసారి నిరూపించింది. భీమ్లా నాయక్, బింబిసార, సార్, మరియు విరూపాక్ష ,అఖండ 2, నారి నారి నడుమ మురారి, వంటి వరుస విజయాలతో టాలీవుడ్‌లో సంయుక్త అదృష్టవంతురాలైన హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఆమె కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇక ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో తన వ్యక్తిగత విషయాలను, తన ప్రయాణాలను అభిమానులతో పంచుకుంటూ వారితో నిరంతరం టచ్‌లో ఉంటుంది. సంప్రదాయ చీరకట్టులో ఎంత పద్ధతిగా కనిపిస్తుందో, ఇలాంటి ఎథ్నిక్ వేర్‌లో అంతే స్టన్నింగ్‌గా కనిపించడం సంయుక్త ప్రత్యేకత.

# అల్ఫోర్స్ టైనీటాట్స్ 'సంచిత' వార్షికోత్సవ వేడుకలు



కరీంనగర్: స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ -- ప్రైమరీ విభాగం ఆధ్వర్యంలో "సంచిత" పేరుతో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ దామెర్ల ప్రీతి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కెప్టెన్ డాక్టర్ బి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దామెర్ల ప్రీతి మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు ఆనందంతో పాటు ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు వివిధ అంశాలపై విశ్లేషణాత్మక దృష్టి పెంపొందించుకోవాలని సూచించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులు సూచించే మార్గదర్శకాలను పాటిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని చెప్పారు. కెప్టెన్ డాక్టర్ బి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు సాగితే సమాజంలో మంచి గుర్తింపు పొందగలరని తెలిపారు. అల్ఫోర్స్‌లో చదువుతున్న విద్యార్థులు అదృష్టవంతులని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్షిక ప్రణాళికలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం



కరీంనగర్: ఎం.ఆర్ ఆర్యవైశ్య భవన్ అధ్యక్షులు జిల్లా అంజయ్య ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొని వ్రతాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సత్యనారాయణ స్వామిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు పాత శేఖర్, కోశాధికారి పాత గంగాధర్, జిల్లా కృష్ణమూర్తి, కొమురవెల్లి రాజ్‌కుమార్, నిర్మల లక్ష్మమూర్తి, కమటాల గణేష్, ఎల్లంకి ప్రతాప్ పాల్గొన్నారు. అలాగే మంకమ్మ తోట రామ్‌నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాధాకృష్ణ, కార్యదర్శి ఎల్లంకి ప్రదీప్, కోశాధికారి జిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా కవిత జన్మదిన వేడుకలు



కరీంనగర్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని కరీంనగర్‌లో తెలంగాణ జాగృతి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా మార్కెట్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కవిత పేరుపై ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు రమేష్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. జిల్లా సీనియర్ నాయకుడు రంగరవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అక్కం శివరాణి ఆధ్వర్యంలో బిట్ వద్ద ఉన్న వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. జిల్లా సీనియర్ నాయకుడు బసవేణి రాజేందర్ ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి అనాథ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా నాయకుడు గుండేటి తిరుపతి ఆధ్వర్యంలో స్పందన వృద్ధుల అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ సామాజిక తెలంగాణ లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాల కోసం కవిత కృషి చేస్తున్నారని అన్నారు. ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు చంటి శ్రీనివాస్, గాలిపల్లి రత్నాకర్ చారి, జంగ అపర్ణ, పిన్నింటి సంగీత రెడ్డి, గర్శకుర్తి విద్యాసాగర్, ఎం.డి. సల్మా, పోన్నం శిరిష, అంజలి, పుసాల పవన్, లంక మనోజ్, మహమ్మద్ హుస్సేన్, ఎం.డి. యాకుబ్, రంగరవేణి ఆకాశ్, హుస్నాబాద్ రాజ్ కుమార్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో భూ మాఫియా

**ఇసుక మాఫియా దందాలపై ఆరోపణలు**

**పట్టణంలో భూ కబ్జాలపై స్థానికుల ఆందోళన**

**వాగులో అక్రమ ఇసుక తవ్వకాలపై విమర్శలు**

**అధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు**




కోరుట్ల, జనతా న్యూస్: కోరుట్ల పట్టణంలో భూ మాఫియా, ఇసుక మాఫియా కార్యకలాపాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజకీయ ముసుగులో కొందరు వ్యక్తులు పేద ప్రజల భూములను కబ్జా చేయడం, వాగుల నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వాదన ప్రకారం పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న పేద, అమాయక ప్రజల ఖాళీ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములు, ప్రభుత్వ భూములపై కొందరు వ్యక్తులు కన్నేశారని చెబుతున్నారు. నకిలీ పత్రాలతో భూములపై హక్కులు చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆరోపిస్తున్నారు. కొంతమంది వ్యక్తులు ప్రజా సేవ పేరుతో ముందుకు వస్తూ రాజకీయ ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నారని, భూముల విషయంలో దొంగ పంచాయతీలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత పది నుండి పదిహేను సంవత్సరాలుగా భూ కబ్జాలు, ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ అండదండల వల్లనే ఈ అక్రమాలు కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కోరుట్ల పట్టణంలో జరుగుతున్న భూ కబ్జాలు, అక్రమ ఇసుక తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


## ఇసుక అక్రమ తవ్వకాలపై ఆందోళన

కోరుట్ల వాగులో రాత్రి, తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహజంగా వాగుల్లో ఉండే ఇసుక భూగర్భ జలాలను నిల్వ ఉంచే పొరగా పనిచేస్తుందని, నియంత్రణ లేకుండా ఇసుక తవ్వడం వల్ల భూగర్భ జలాల మట్టం పడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. లోతుగా తవ్వకాలు జరపడం వల్ల వాగు ప్రవాహ దిశ మారే ప్రమాదం ఉందని, వరదల సమయంలో సమీప ప్రాంతాల ప్రజలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేసి పర్యావరణ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేడు మహ్మదపూర్ అమరవీరుల 78వ వర్ధంతి

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న చాడ వెంకటరెడ్డి**

**సభను జయప్రదం చేయాలని సీపీఐ పిలుపు**




హుస్నాబాద్,జనత న్యూస్: తెలంగాణ సాయుధ పోరాట యోధులు, అమరజీవి అనభేరి ప్రభాకర్‌రావు సహా 12 మంది వీరుల 78వ వర్ధంతి సభను శనివారం (మార్చి 14న) హుస్నాబాద్ మండలం మహ్మదపూర్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, పేదలకు భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఈ వీరుల స్మారకార్థం నిర్వహించే ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. 1948 మార్చి 14న మహ్మదపూర్ గ్రామ సమీపంలోని భూషణగట్ల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీపీఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రథమ కార్యదర్శి అనభేరి ప్రభాకర్‌రావుతో పాటు సింగిరెడ్డి భూపతి రెడ్డి, ముస్కు చొక్కారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమోజు నారాయణ, బి.దామోదర్ రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పోరెడ్డి రాంరెడ్డి, నల్లగొండ రాజారాం, చిక్కోడు సాయిలు, రోండ్ల మాధవరెడ్డి వీరమరణం పొందారని ఆయన గుర్తు చేశారు. శనివారం ఉదయం మహ్మదపూర్‌లోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం మహ్మదపూర్ గుట్టల్లో ఉన్న వారి సమాధుల వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించనున్నట్లు మల్లేశ్ వెల్లడించారు. అనంతరం నిర్వహించే సంస్మరణ సభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణతో పాటు ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ పార్టీ శ్రేణులు, రైతులు, కూలీలు, మేధావులు, అభ్యుదయ రచయితలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

**హుస్నాబాద్‌లో ముమ్మరంగా 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్'**

**స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి**



హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణ ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం హుస్నాబాద్‌లో ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిసరాలను పర్యవేక్షించిన ఆమె, నిల్వ ఉన్న నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చల్లించే పనులను స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం 'డ్రై డే - ఫ్రై డే' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. వర్షాకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, అందుకే ప్రతి శుక్రవారం పొడి రోజుగా పాటించి నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. ఇంటి వద్ద సేకరించిన చెత్తను వీధుల్లో పారవేయకుండా, తడి,పొడి చెత్తగా విడదీసి మున్సిపల్ వాహనాలకే అందించాలని కోరారు. పట్టణంలోని 4వ, 10వ వార్డుల్లోని మినీ వాటర్ ట్యాంకులను ఇప్పటికే శుభ్రం చేయించామని, ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హుస్నాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన 'స్వచ్ఛ పట్టణం'గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనూష, లత, తిరుపతి, రాజు, సంపత్, మంజుల, వరప్రసాద్, రమేష్, శ్రీనివాస్, రవీందర్, సుప్రజ, స్వరూపలతో పాటు మున్సిపల్ అధికారులు, బేసిల్ ఫౌండేషన్ ప్రతినిధులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# విశ్వకర్మ యోజన పథకం చేతివృత్తులకు ఆర్థిక బలం: మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్: సాంప్రదాయ చేతివృత్తులకు ప్రోత్సాహం అందించి కళాకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని చింతకుంటలో విశ్వకర్మ యోజన పథకం కింద పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, 15 రోజులపాటు శిక్షణ పొందిన లబ్ధిదారులకు తన చేతుల మీదుగా 56 టూల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గ్రామీణ స్థాయి ప్రజలకు చేరడం సంతోషకరమన్నారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా తెలంగాణలో కొత్తపల్లి మండల కేంద్రంలోనే దాదాపు 260 మంది లబ్ధి పొందడం విశేషమన్నారు. ఈ పథకం ద్వారా 18 రకాల సాంప్రదాయ వృత్తులకు చెందిన కళాకారులకు శిక్షణతో పాటు రూ.15 వేల విలువైన పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే తక్కువ వడ్డీతో మొదటి విడతగా రూ.1 లక్ష, రెండో విడతగా రూ.2 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తూ ఉపాధి అవకాశాలను పెంచుతున్నట్లు పేర్కొన్నారు. విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధి పొందిన వారి తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అనిల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదు: కలెక్టర్ చిత్రా మిశ్రా

### ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

### హాస్టళ్లు, ఆస్పత్రుల్లో సరఫరా అంతరాయం లేకుండా చర్యలు

### బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు

### గ్యాస్ సరఫరా పర్యవేక్షణకు డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు



కరీంనగర్: జిల్లాలో గృహ వినియోగానికి అవసరమైన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలో సరిపడా నిల్వలు ఉండటంతో యథావిధిగా గ్యాస్ సరఫరా కొనసాగుతోందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై పోలీస్, సివిల్ సప్లై, రవాణా, విద్య, ఆరోగ్య తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల నుంచి పరిస్థితులను తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, విద్యాసంస్థల్లో గ్యాస్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి హాస్టల్, గురుకుల పాఠశాలలను సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. అలాగే ఆస్పత్రుల్లో అవసరమయ్యే గ్యాస్ సరఫరాపై వైద్యశాఖ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

జిల్లాలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తూ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పోలీస్, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తే కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరాపై పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సివిల్ సప్లై అధికారి కన్వీనర్‌గా 12 మంది సభ్యులతో డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనర్ ఆఫ్ పోలీస్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా రవాణా అధికారి, జిల్లా విద్యాధికారి, సంక్షేమ అధికారులు, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు సభ్యులుగా వ్యవహరిస్తారని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్న 39 డొమెస్టిక్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారని, 15 కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, యథావిధిగా సరఫరా కొనసాగుతుందని తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే జిల్లా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 9154249727 ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, జిల్లా సివిల్ సప్లై అధికారి నర్సింగరావు, డీసీపీ వెంకట్ రమణ, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా రవాణా అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రష్యా నుంచి చమురు కొనుగోళ్లు

### భారత్‌కు అనమతించిన అమెరికా వాణిజ్య శాఖ

### ఇందన సంక్షోభానికి తెరదించే యత్నంగా వెల్లడి

**వాషింగ్టన్:** ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికాల ఉద్రిక్తతల నేపథ్యంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. రష్యా చమురు కొనుగోలుకు స్వల్పకాలికంగా అనుమతినిస్తూ అమెరికా ఉత్తర్వులు జారీ చేసింది. సముద్రంలో నిలిచిపోయిన చమురును కొనుగోలు చేసేందుకు ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించింది. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్న తరుణంలో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకు రావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'ప్రపంచ ఇంధన మార్కెట్‌లో స్థిరత్వాన్ని పెంపొందించడం, ధరలను అదుపులో ఉంచేందుకే ట్రంప్ ఈ నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి సముద్రంలో నిలిచిపోయిన చమురు రవాణాకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయి' అని బెసెంట్ స్పష్టం చేశారు. రష్యాపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటి కీ అమెరికా తాత్కాలిక సడలింపులతో పుతిన్ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని బెసెంట్ అన్నారు. రష్యాకు వచ్చే ఆదాయంలో అధిక భాగం చమురు వెలికితీసే సమయంలోనే పన్నుల రూపంలో అందుతుందని, ఇప్పుడు రవాణాలో ఉన్న చమురు అమ్మకం వల్ల వారికి అదనపు ప్రయోజనమేమీ ఉండదని ఆయన వివరించారు. ఈ నిర్ణయం వల్ల స్వల్పకాలికంగా ధరలు పెరిగినా.. దీర్ఘకాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతో మేలుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే.. తాజా సడలింపులతో మార్చి 12 నాటికి నౌకల్లో లోడ్ అయిన రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను ఏప్రిల్ 11 వరకు విక్రయించుకోవచ్చు. గతంలో అమెరికా ఆంక్షలు విధించిన రష్యన్ సంస్థల నుంచి ఉత్పత్తైన చమురును కూడా ఇప్పుడు కొనుగోలు చేసుకోవచ్చు. ఇకపోతే ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇరాన్ ఉపశమనం కలిగించింది. భారతీయ ట్యాం కర్లను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతించింది.

# విద్యార్థులు విజయవంతం కావాలి: బండి సంజయ్

కరీంనగర్: ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలను విద్యార్థులు విజయవంతంగా రాసి ఉత్తీర్ణులు కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు రాయనున్న 5,17,727 మంది విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయానికి కనీసం అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పరీక్షలు రాయనున్న విద్యార్థులందరికీ ముందస్తుగా అభినందనలు తెలిపారు. విద్యార్థుల చదువు పట్ల ఉన్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని పదో తరగతి చదివే పేద విద్యార్థులకు దాదాపు 20 వేల మందికి ఉచితంగా సైకిళ్లు అందించామని గుర్తు చేశారు. దీంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు వెళ్లేందుకు అవకాశం కలిగిందన్నారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును కూడా తానే చెల్లించడంతో వారి తల్లిదండ్రులకు కొంత ఆర్థిక భారం తగ్గిందని తెలిపారు. పరీక్షల సమయంలో అనవసర ఆందోళనకు గురికాకుండా ఇప్పటివరకు చదివిన విషయాలను పునశ్చరణ చేసుకొని ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. గత సంవత్సరం పరీక్ష ఫలితాల్లో కరీంనగర్ జిల్లా ఉత్తీర్ణతలో ఆరో స్థానంలో, సిరిసిల్ల జిల్లా ఐదవ స్థానంలో నిలిచాయని గుర్తుచేసి, ఈసారి రెండు జిల్లాలు మొదటి, రెండవ స్థానాల్లో నిలిచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు, అధికారులు, పోలీసులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రవాణా, ట్రాఫిక్ పరంగా కూడా సమస్యలు లేకుండా చూడాలని అన్నారు.ాను ఈ నెల 14న చేపట్టనున్న కొండగట్టు అంజన్న పాదయాత్ర సందర్భంగా కూడా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, మంచినీళ్లు వంటి వసతులు కల్పించాలని అధికారులను కోరారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు సురక్షితంగా తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకురావాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని బండి సంజయ్ ఆకాంక్షించారు.

# కొత్త కలెక్టరేట్‌ను సుందరంగా తీర్చిదిద్దండి: కలెక్టర్ చిత్రా మిశ్రా





కరీంనగర్: కొత్త కలెక్టరేట్ భవనంలో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కొత్త కలెక్టరేట్ భవనాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ మ్యాప్‌ను పరిశీలించి మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫినిషింగ్ పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వేగంగా పూర్తి చేసి కలెక్టరేట్‌ను అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రధాన గేటు నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి అంతస్తులో ఎక్కడా పనులు పెండింగ్‌లో లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. నీటి సరఫరా పైప్‌లైన్ పనులను పకడ్బందీగా పూర్తి చేసి కలెక్టరేట్ ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో కే. మహేశ్వర్, ఆర్ అండ్ బి ఈఈ నరసింహచారి, ఎలక్ట్రికల్ ఈఈ కమలేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

### గజ్వేల్ ఇఫ్తార్ విందులో హరీష్ రావు విమర్శలు

**గజ్వేల్,మార్చి13 :** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మదీనా మసీదులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి వారు ఇఫ్తార్ విందులో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ముస్లిం సోదరులకు రంజాన్ అత్యంత ప్రాముఖ్యమైన మాసం. ఆకలితో అలమటించే పేదవారి కడుపు బాధ ఎలా ఉంటుందో ఈ ఉపవాస దీక్షల ద్వారా ప్రతి ఒక్కరికి అర్థమవుతుందని' అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై స్పందిస్తూ.. 'గల్ఫ్ దేశాలలో యుద్ధ వాతావరణం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోతోంది. దీని వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. భవిష్యత్ లో పెట్రోల్ ధరలు పెరగడమే కాకుండా, గ్యాస్ సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గజ్వేల్ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధులు తిరిగి వెనక్కి తీసుకుంది. కొత్త నిధులు ఇవ్వాల్సింది పోయి, ఉన్న నిధులు లాక్కోవడం దారుణం. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ముస్లిం సోదరుల సంక్షేమం కోసం కట్టుబడ ఉంటామని' అన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com